
# తన వారెవరో.., పెరవారెవరో..



"కాస్త మాకు ఫోటో తీసిపెడతారాండీ?" అన్న జనార్దన్ కేసి చుశాడు పవన్. తమలాగే హనీమూన్‌కు ఊటీకొచ్చిన జంట కాబోలు అనుకుంటూ ఫోటో తీశాడు. పరిచయాలయ్యేయి.

వాళ్ళుకూడా హోటల్ ఏసియానాలోనే దిగారుట. ఎదురు గదేనట.

బొటానికల్ గార్డెన్స్‌లోంచి బయట పడిన రెండు జంటలూ హోటల్ రూమ్ చేరేలోపల ఫ్రెండ్సయిపోయారు. ఆ తర్వాతి మూడు రోజుల్లో కలిసి సైట్ సీయింగ్ టూర్లకు వెళ్ళడంతో మరింత దగ్గరయ్యేరు. మూడో రోజు సాయంత్రం బజార్లోంచి వస్తూవుంటే సినిమా హాలు దగ్గరకొచ్చేసరికి

— ఎమ్బీయస్ ప్రసాద్

"ఇవాళ ఈ సినిమా కెళితే ఎలా వుంటుంది" అంది పవన్ భార్య ప్రణీత.

"అరవసినిమా. అందులోనూ పాతసినిమా. ఏం చూస్తాం?" అంది జనార్దన్ భార్య జయంతి.

" అరవ సినిమా అయినా ఫర్వాలేదు. నేను కథ చెప్పగలుగుతాను. దీన్ని తెలుగులో తీశారు. నేను చూశానుకూడా. పేరు గుర్తు లేదు కానీ. బావగారు చీకట్లో గుర్తు తెలియక భార్య అనుకుని మరదల్ని అనుభవిస్తాడు. దాంతో కాంప్లికేషన్స్ వస్తాయి. ఆ అమ్మాయి ఆత్మహత్య..." అన్నాడు జనార్దన్.

"బాబోయ్, ఆ సినిమానా? బోర్! అయినా నాకు తెలియక అడుగతాను, ఎంత చీకటి అయితే మాత్రం భార్యెవరో, పరాయి ఆడదెవరో తెలియకుండా ఎలా వుంటుందండీ? అంతా హంబగ్! ఇలాటి కథ పెట్టుకుని అరవంలో తీయడం, దాన్ని తెలుగులో తీయడం, రేపొద్దున హిందీలో కూడా..." అంటూ ఈసడించాడు పవన్.

"అలా కొట్టేయకండి! ఒడ్డూ, పొడుగూ ఒకేలా వుంటే అలా కన్ఫ్యూజ్ కావడానికి ఛాన్స్ లేకపోలేదు. అయినా కటికచీకటిలో అది జరుగుతుంది కదా! కొంతైనా వాస్తవం వుండకపోతే అన్ని లక్షలమంది ప్రజలు దాన్ని ఎలా నమ్మారు?" అన్నాడు జనార్దన్.

"ఏమిటి సార్, చెప్తారు? మాకు పెళ్ళయి నెల కూడా కాలేదు. అయినా మా ఆవిడ స్ట్రక్చర్ నాకు బాగా అలవాటైపోయింది. పరాయి ఆడదాన్ని తాకితే తేడా తెలియదంటారా?" అంటూ వాదానికి దిగాడు పవన్.

చర్చ చాలా ఘాటుగా సాగింది. ఆడవాళ్ళు కూడా పాల్గొన్నారు. చివరికి జనార్దన్ ఒక వింత ప్రయోగం ప్రతిపాదించాడు. రోజూ రాత్రి ఏడునుంచి ఎనిమిది దాకా పవర్ కట్ కదా! హోటల్లో బాగా చీకటిగా వుంటోంది. జనరేటరు లేకపోవటంవల్ల కొవ్వొత్తులు పెడుతున్నారు. ఆ టైములో పవన్ గదిలో కొవ్వొత్తులు ఆర్పేసి పూర్తిగా చీకటి చేసేయాలి. చీకట్లో జయంతి, ప్రణీత ఇద్దరూ బట్టలు విప్పేసి నగ్నంగా నిలబడతారు. పవన్ చీకట్లోనే తడిమి ఎవరు తన భార్యో చెప్పగలగాలి. కరెక్టుగా చెబితే మర్నాటి సైట్ సీయింగ్ ఖర్చంతా తను పెట్టుకుంటానన్నాడు జనార్దన్.

దీనిమీద కొంత తర్జనభర్జన జరిగింది కానీ, అందరూ నవతరానికి చెందినవారే కావడంతో "తప్పేముంది? డాక్టరు దగ్గర కెళితే ఏం చేస్తున్నాం కనక?"లాటి సంజాయిషీలు తమకుతామే చెప్పుకుని ఈ పందానికి సమ్మతించారు.

"ఇప్పుడు ఆరున్నర అయింది. హోటల్‌కి వెళ్ళగానే ప్రయోగం జరుపుదాం. ఈ లోపల పవన్, ప్రణీత మాట్లాడుకోకూడదు. లేకపోతే ఏదైనా సిగ్నల్ పెట్టెసుకుని భార్యాభర్తలిద్దరూ గూడుపుఠాణీ చేసేయవచ్చు" అన్నాడు జనార్దన్.

అతను భయపడినట్లుగానే ప్రయోగం టైములో ప్రణీత భర్తకి సిగ్నల్ ఇవ్వబోయింది . హోటల్లో కరెంటు పోగానే కొవొత్తులు ఆర్పేసి, పవన్ కళ్ళకు గంతలు కట్టి జనార్దన్ బయటకు వెళ్ళిపోయాడు. జయంతి, ప్రణీత ఇద్దరూ దిగంబరంగా తయారయ్యి, మంచంపైన తట్టి "రెడీ!" అన్నట్టుగా తెలియబరిచేరు మాట్లాడితే మనిషెక్కడుందో తెలిసిపోతుందని ఈ ఏర్పాటు. అనుకోకుండా పవన్ తన భార్య శరీరాన్నే ముందుగా అందుకున్నాడు. అతను తడిమి చూస్తుండగానే పక్కనే జయంతి నిలబడినా ఆమెకు కూడా చీకట్లో ఏమీ కనబడదన్న ధైర్యంకొద్దీ ప్రణీత "నేనే" అని పవన్ చేతిమీద రాసింది. అయినా పవన్ ఆమెను గుర్తు పట్టలేదులా వుంది. జయంతి శరీరాన్ని నిమిరి చూశాడు. అనుమానం వచ్చి మళ్ళీ ప్రణీతను పట్టి చూశాడు. ఇంకోసారి జయంతి అంగాంగం నొక్కిచూశాడు. చివరికి ప్రణీతే తన భార్య అని తేల్చిచెప్పాడు.

ఆడవాళ్ళిద్దరూ బట్టలు వేసుకున్నాక, జనార్దన్ లోపలికి వచ్చి పవన్ కళ్ళగంతలు విప్పాడు. పవన్ కరెక్టుగానే చెప్పినా పందెం ఓడిపోయినట్లేనంది జయంతి. ప్రణీతను మొదటిసారి స్పృశించగానే ఆమె తన భార్యో కాదో గుర్తుపట్టాలి గానీ, ఇంతసేపు, ఇన్నిసార్లు తర్జనభర్జన పడ్డాక గుర్తుపట్టడం గొప్పకాదంది. ఆ విషయం మొదట్లో చెప్పలేదని వాదించారు పవన్, ప్రణీత. అలా అయితే జయంతి,

ప్రణీత ఇద్దరూ నిల్చోనక్కరలేదని, ఒక్కరు నిలబడినా సరిపోయేదనీ వాదించారుకూడా. పందెం రూల్స్ సరిగ్గా ఏర్పాటు చేయలేదని జనార్దన్‌ని నిందించారు. చివరికి జనార్దన్ అన్నాడు– "పోన్లెండి. మీరు పందెం డబ్బులో సగం ఇవ్వండి చాలు!" అని.

ఆ రాత్రి పడుక్కోబోతూ ప్రణీత అంది – "మీరొట్టి మఫ్! నేను 'నేనే' అని చేతిమీద రాసి సిగ్నల్ ఇచ్చినా గుర్తు పట్టలేకపోయారు."

పవన్ చిరునవ్వు నవ్వాడు. "నువ్వేమీ అనుకోనంటే నిజం చెప్పనా డార్లింగ్?" అన్నాడు.

"మీలో హిపాక్రసీ లేకపోవడమే నాకు బాగా నచ్చే లక్షణం. చెప్పండి. నేనేమీ అనుకోను" అంది ప్రణీత ఉత్సాహంగా.

"నీ సిగ్నల్ నాకు అర్థమయ్యింది. అప్పుడే చెప్పేస్తే మొదటే గెలిచేవాణ్ని. ఆరొందలపైన మిగిలేవి. రెండో స్త్రీ దగ్గరకూడా వెళ్ళానంటే నిన్ను గుర్తు పట్టలేకపోయినట్లే కదా అన్న పాయింటు వచ్చి పందెం ఓడిపోయానంటారేమోనన్న ఐడియా కూడా వచ్చింది. పందెం పోతే పోయింది. పరాయి స్త్రీని అంత క్షుణ్ణంగా తడిమిచూసే అవకాశం మళ్ళీ రాదని నీ సిగ్నల్ అర్థం కానట్టు నటించాను." అన్నాడు పవన్.

"అమ్మదొంగా! అదా ఎత్తు!" అంది ప్రణీత.

"మనిషన్నాక ఆ మాత్రం రొమాంటిక్‌గా వుండాలి. చూశావా, ఎంత ఫ్రాంక్‌గా చెప్పేసేనో! నువ్వు కూడా నాలాగే హిపాక్రసీ లేకుండా ఫ్రాంక్‌గా చెప్పేస్తే సంతోషిస్తాను. ఏమైనా వుంటే చెప్పేయి. మనం ఒకరినొకరు బాగా అర్థం చేసుకోవడానికే హనీమూన్" అన్నాడు పవన్ హుషారుగా, భార్య తనను తప్పుపట్టనందుకు సంతోషిస్తూ.

ప్రణీత చెప్పుకువచ్చింది – "మీరు అలా అన్నారు కాబట్టి చెబుతున్నాను. నిన్న ఒక పొరపాటు జరిగింది. సైట్‌సీయింగ్ నుంచి తిరిగి వచ్చాక నన్ను రూమ్‌కి వెళ్ళిపొమ్మని చెప్పి, మీరు ఫోటో రీలు తేడానికి వెళ్ళారు కదా! రూమ్‌కి రాగానే కరెంటు పోయింది. దాంతో నిద్ర పట్టేసింది. కాస్సేపటికి ఎవరో మీదపడి కుమ్మేస్తున్నారు. బస్‌లో మీరు శృంగారం వెలగబెట్టబోయారు కదా, వేడి మీద వున్నారని మీ కోసం తలుపు తీసే వుంచాను. వస్తూనే మొదలెట్టేశారు అనుకున్నాను. కాస్సేపు పోయాక వచ్చింది జనార్దన్ అని. ఆయనా ఏదో మందు కొనడానికి వెళ్ళాడు మీలాగే. చీకట్లో ఎడమచేతి వేపు బదులు, కుడిచేతి వేపు తిరిగాట్ట. ఎదురెదురు గదులేగా మనవి! వాళ్ళూ హనీమూన్ జంటేనాయె! భార్య బాగా సహకరిస్తోంది అనుకున్నాడుట. దాంతో ఇదంతా... మీరు గమనించారో లేదో చీకట్లో గుర్తుపట్టడం అసంభవం అని ఆయన గట్టిగా వాదించడానికి అదేకారణం. అయినా మీరు తెలిసి చేశారు. నేను తెలియక చేశాను. అందుచేత మీరేమీ నన్ను తప్పు పట్టకూడదు..."

"కాస్సేపటికైనా తెలిసిందిగా? అప్పుడేం చేశావ్?"

"ఇక అప్పుడేం చేస్తాం? అయ్యిందెలానూ అయింది. పూర్తిగా కానిచ్చేశాం. మీరే అన్నారుగా, మనిషన్నాక రొమాంటిక్‌గా వుండాలని! అదేమిటండీ, మొహం అలా పెట్టారు? కళ్ళు తిరుగుతున్నాయా?!"

(ఆంధ్రప్రభ వీక్లీ ఆగస్టు 1998)

# ఆలూమగలీయం

## కహో న....

> హృతిక్‌రోషన్ను చూడ్డానికి కలకత్తా బాలికలు
> బొంబాయి రైలెక్కిన వైనం - వార్త

"లోకం ఎక్కడకు పోతోందో తెలిసిచావటం లేదు సావిత్రీ..."

"రోజూ ఎక్కడికి పోతోందో, ఇవాళా అక్కడికే పోతోంది. దాని గురించి వర్రీ కావటం మానేసి మీ బాధ చెప్పండి మహాశయా..."

"కొత్త హీరో హృతిక్ రోషన్ లేడూ... రాకేష్ రోషన్ కొడుకు...' అదే కహోనా ప్యార్ హై లో హీరోగా వేసాడూ..."

"అన్ని వర్ణనలెందుకు? సింపుల్‌గా హృతిక్ అంటే చాలు హృదయంలోకి సూటిగా వెళ్లిపోతుంది."

"ఏడిసినట్టుంది, నీ శ్లేషో, అదేమిటో. ఇంతకీ చెప్పేది విను. కలకత్తా స్కూల్లో చదివే ఆడపిల్లలు ఇతగాడిని చూడ్డానికి ఇంట్లో చెప్పకుండా రైలెక్కేస్తున్నారట."

"బాగానే ఉంది. ఇంకీ మీ బాధ ఏమిటని?"

"ఇది విని నీ కాశ్చర్యం వేయకపోవడం నా కాశ్చర్యంగా ఉంది. సినిమా క్రేజ్ ఇంతలా వ్యాపిస్తోందంటే లోకం..."

"...సినిమా క్రేజ్ కాదు, హృతిక్ రోషన్ క్రేజ్"

"అదే! ఏదో ఓ కుర్రాడి గురించి..."

"కుర్రాడు కాదు, హృతిక్ రోషన్..."

"...అబ్బ, అదే లేవయ్యా, ఏదో నోరు తిరగని పేరుగాడు. వాడికోసం ఆడపిల్లలు చెప్పా పెట్టకుండా.. కనీసం వాళ్ల అమ్మో, అత్తో కాస్త బుద్ధి చెప్పిచెప్పద్దూ..?"

"వీళ్లు వాళ్లతో ఇలా బండెక్కుతున్నామని చెబితేకదా వాళ్లకు తెలిసేది! చెబితే వాళ్లూ వస్తామంటారేమోనని వీళ్ల భయమేమో!"

"అదేమిటి పిచ్చిమాటలు? స్కూలుగర్ల్స్ క్రేజ్ వాళ్లకెందుకుంటుంది?"

"హృతిక్ క్రేజ్ స్కూలు గర్ల్స్‌కే పరిమితం కాదు లెండి. పెళ్లయినవాళ్లూ, కాని వాళ్లూ అందరూ పడి కొట్టుకుపోతున్నారు ఆ క్రేజ్‌లో..."


"చాల్లే జోకులు! అయినా నువ్వింత లైట్‌గా తీసుకోవడం చిత్రంగా ఉంది. మొన్నామధ్య టీవీలో వచ్చిన 'గుడ్డీ' సినిమాలో ధర్మేంద్ర పిచ్చితో పెళ్లి వద్దన్న జయబాధురిని తిట్టిపోసావ్!"

"చాల్లెండి! ధర్మేంద్రా, హృతిక్కూ ఒకటేనా?"

"నీకు పెద్ద హృతిక్కు బాగా తెలిసున్నట్టు చెబుతున్నావు. వేసిందే ఒక్క సినిమా. అదీ ఒక్కసారి చూసావు..."

"...పొరబాటు, మీతో కలిసి చూసిందే లెక్క వేస్తున్నారు. ఇరుగావిడతో చూసింది, పొరుగావిడతో చూసింది, అన్నిటికీ మించి మీ చెల్లెలు బొంబాయి నుంచి వచ్చినప్పుడు చూసింది - అవన్నీ లెక్కవేసి చూడండి."

"ఏడిసినట్టుంది. రేణుకకు కూడా నీ సినిమా పిచ్చి అంటించావూ? మీ ఇద్దరూ కలిసి అరడజను



సినిమాలు చూసారంటేనే అనుకున్నాను.."

"అరడజను సినిమాలు కావు. ఇదే సినిమా అరడజను సార్లు.."

"ఇందాకట్నుంచి చూస్తున్నాను. నీ వరస అర్థం కావటం లేదు. చూస్తుంటే నీకూ హృతిక్ మానియా పట్టినట్టుంది."

"అమ్మయ్య! మట్టి బుర్రకు ఇంతసేపటికి తట్టింది. అందుచేత ఇక కలకత్తా పిల్లల గురించి వర్రీ కావడం మానేసి స్నానానికి లేవండి."

"సావిత్రీ! దీసీజ్ టూ మచ్! చెట్టంత మొగుణ్ని ఎదుట పెట్టుకుని పరాయి మొగవాడి గురించి..."

"...పోలిక బాగా లేదు. హృతిక్‌తో పోలిస్తే మీరు మొక్కంత కూడా లేరు."

"హృతిక్ అందగాడయితే కావచ్చు. కానీ ఇలా మొగుడితో పోల్చడం, పైగా అది పైకి చెప్పడం ఏమాత్రం బాగాలేదు."

"హృతిక్కేమో 'కహోనా ప్యార్ హై..., ప్రేమ ఉందని చెప్పవూ' అంటున్నాడు. మీరేమో 'కహో న', చెప్పద్దు, అంటున్నారు. ఇక్కడే తెలుస్తోంది తేడా."

"ఇదీ ఇంకా దారుణంగా ఉంది. బొత్తిగా సిగ్గు వదిలేసినట్టున్నావు. మొగుడితో మాట్లాడవలసిన తీరేనా ఇది?"

"సిల్క్‌స్మిత సినిమా ఒక్కటి కూడా వదలకుండా చూసానని నా దగ్గర చెప్పిన వాళ్లకు సిగ్గుందంటారా?"

"అది వేరే! ఇది వేరే! అప్పుడేదో సరదాగా చూసానని చెబితే దానికీ, దీనికి లింకెడతావేవిటి?"

"ఇప్పుడు మాత్రం హీరోయిన్ల గురించి మీరు చేసే కామెంట్లు ఎలాటివంటారు?"

"సావిత్రీ, నీకు బొత్తిగా మగా, ఆడా తేడా తెలియకుండా పోతోంది."

"పోన్లెండి. మీ చెల్లెలు నేర్పిస్తుంది లెండి. బొంబాయి వెళుతున్నాగా, తనని అడిగి తెలుసుకుంటా..."

"ఆగాగు. నువ్వు బొంబాయి వెళ్లేది కొంపదీసి హృతిక్‌ను చూడడానికి..."

"కొంపదీయకుండానే వెళుతున్నాను లెండి. కొంపెక్కడికి పోతుంది? హృతిక్‌ను చూసి తిరిగి వచ్చేసరికి నా కోసం ఎదురుచూస్తూనే ఉంటుంది. మళ్లీ బూజులు దులుపుకుని..."

"... ఆ సొద ఆపు. ఎప్పుడూ ఉండేదే! ముందిది చెప్పు. 'హృతిక్‌ను చూసి..' అంటున్నావు. ఏమిటి కథ?"

"కథేముంది? రేణుకకు వాళ్ల ఇంటి అడ్రసు తెలుసుట! బొంబాయి వస్తే దగ్గరుండి తీసుకెళతానంది. వెళతానంటే మీరూ సరేనన్నారు."

"సరేనన్నానంటే... నాకేం తెలుసు, ఇందులో తిరకాసుందని. మా చెల్లెలితో ఇంత సఖ్యం ఎప్పటినుండా అనుకుని ఆశ్చర్యపడ్డాను కానీ ఇంత కుట్ర ఉందనుకోలేదు..."

"...మా ఇద్దరి మధ్యా సఖ్యత లేకపోవడమేం?"

"అవునవును. ఇలాటి విషయాల్లోనే ఉంది. నీ ప్రయాణం ఆపితే మా చెల్లెలి మాట ఎత్తి నోరు మూయిస్తావు. ఏం చేస్తాం? ఆ స్కూలు పిల్లల్ని అని ఏం ప్రయోజనం? నీ వయస్సు వాళ్లకే ఇలా ఉంటే... సరే, సరే, జాగ్రత్తగా వెళ్లి రా."

"తప్పకుండా వచ్చేస్తాను. హృతిక్‌ను ఓ సారి చూసి, పలకరించి మళ్లీ మీ దగ్గరకే వచ్చేస్తాను. వర్రీ కాకండి. అతను ఉండిపోమని బలవంతపెట్టినా వచ్చేస్తాను. సరేనా? అదేమిటండీ అలా పళ్లు నూరుకుంటున్నారు?..."